అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

2009
అక్టోబర్ – డిశంబర్

278

సంపాదకుడు
**సి. ప్రసాద్**

మేనేజర్
**ఎస్. రవికుమార్**
5-1307,
దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు,
కడప జిల్లా – 516 360.
సెల్ : 9866021257

రచనలు పంపవలసిన చిరునామా :
**టి. కృష్ణాబాయి**
9-19-3
CBM కాంపౌండ్
విశాఖపట్నం – 530 003.

# సంపాదక లేఖ

మూడు దశాబ్దాల తెలుగు ప్రజల పోరాట చరిత్ర నుండి విడదీయలేని మూర్తిమత్వం బాలగోపాల్. ఆయన నేతృత్వంలో పౌరహక్కుల సంఘం, మానవ హక్కుల వేదిక ఒక గొప్ప సామాజిక ప్రయోగంగా హక్కుల ఉద్యమాన్ని విస్తరింపజేశాయి. దేశంలో అణగారిన ప్రజల, కులాల, తెగల, జాతుల, మతమైనారిటీల, మహిళల, ప్రాంతాల ఆకాంక్షలకు హక్కుల ఉద్యమ పతిపత్తినందించాయి. ఆ సంస్థల సామూహిక స్వరంగా బాలగోపాల్ పలుకులోని చైతన్యం తెలుగు సామాజిక చరిత్రలో సజీవంగా ఉంటుంది. బాలగోపాల్‌ను దాటి ఆయన అందించిన చైతన్యం ప్రజా జీవితంలో నిత్యం వికసిస్తూనే ఉంటుంది.

విరసం నుండి, విప్లవోద్యమం నుండి, మౌలికంగా మార్క్సిజం నుండే వైదొలగిన వారందరివలె బాలగోపాల్ కూడా వాటన్నింటి మీద తీవ్ర విమర్శలు చేశాడు. మాటలు మాటలకోసమేకాని ఆయన ఆచరణీయ వ్యక్తిత్వం వల్ల విరసం, విప్లవోద్యమం బాలగోపాల్ ప్రతి వ్యాఖ్యను పరిగణలోకి తీసుకున్నాయి. మార్క్సిజానికి, వర్గపోరాటానికి వ్యతిరేకంగా ఆయన చేసిన విశ్లేషణలన్నిటితో తలపడవలసి వచ్చింది.

విప్లవంతో ఉంటూ ఒక క్రమంలో మార్క్సిజానికి వ్యతిరేకంగా తయారైన వారెందరో ఉన్నా బాలగోపాల్‌తో జరిగినంత సంవాదం మరెవరితోనూ జరగలేదు. నేరుగా వాద ప్రతివాదాల రూపంలో కాకపోయినా పౌరహక్కులు, సాహిత్య విమర్శ, విప్లవాచరణ, మార్క్సిస్టు సిద్ధాంతం మొదలైనవాటిలో ఆయన సూత్రీకరణలన్నిటినీ ఎదుర్కొని మార్క్సిస్టు అవగాహన మరోసారి చెప్పాల్సి వచ్చింది. ఆయన ప్రజా ఆచరణను హృదయానికి హత్తుకుంటూనే ఈ పని చేయవలసి వచ్చింది.

అక్టోబర్ 8 వతేదీన అలాంటి ఒక గొప్ప ఆలోచనా జ్వాల అర్ధాంతరంగా ఆరిపోయింది. ఆయన మరణం తీరని లోటని, యిక అంతా అంధకారమేననీ అనడం బాలగోపాల్ స్ఫూర్తికి వ్యతిరేకం. ఆయన అవసరాన్ని మనం తీర్చవలసి ఉన్నది. ఆయన అందించిన ప్రజాస్వామిక విలువలను ఉన్నతీకరించవలసి ఉన్నది. అంతకంటే ముందు మనం బాలగోపాల్‌ను పునర్దర్శించ వలసి ఉన్నది. పునర్నిర్మించవలసి ఉన్నది. కేవలం రాసినవాడు, కేవలం పనిచేసిన వాడు కాదాయన. ఆ రెండింటి మేలు కలయిక. చురుకైన మార్క్సిస్టుగా మొదలై ఉదారవాద సిద్ధాంతాలను చేరుకున్నాడు. అందువల్ల ఆయన్ను ఆ మూలాగ్రం విశ్లేషించాలి. ఆయన మార్క్సిజాన్ని కాదనుకున్న తర్వాత చేసిన వాదనల గురించి చర్చ జరిగిందిగాని, అంతకుముందు రోజుల్లో కూడా మార్క్సిస్టుగా ఆయన ఏమిటి? అనేది చాలా ముఖ్యం.

నిజానికి మార్క్సిస్టు అని ఏదో ఒక ప్రమాణాన్నో, కొన్ని ప్రమాణాలనో ఆధారం చేసుకొని నిర్ధారించలేం. బాలగోపాల్‌లాగా బహుముఖీన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తుల విషయంలో ఈ పని చాలా కష్టమే. అన్నీ ముఖ్యమైనవే అయినా, పరస్పర సంబంధమున్నవే అయినా మార్క్సిజాన్ని ఒక సామాజిక శాస్త్రీయ సిద్ధాంతంగా బాలగోపాల్ తొలినాళ్ల నుంచి ఎలా అర్థం చేసుకున్నాడు? సామాజిక సిద్ధాంతకారునిగా దానితో ఎలా వ్యవహరించాడు? అనేది చాలా కీలకం. ఈ ప్రశ్నలు ఆనాటి విప్లవ ఆలోచనారంగం మొత్తానికి వర్తిస్తాయని అంగీకరిస్తూనే - నిర్దిష్టంగా 1993 నుంచి మార్క్సిజం మీద బాలగోపాల్ విమర్శలను 1983 నుంచి ఆయన మార్క్సిస్టు చింతనాక్రమంతో వేరు చేసి చూడకూడదు. కోశాంబి ప్రేరణతో మార్క్సిస్టు అయిన ఒక ఆలోచనాపరునిలో చారిత్రక దృక్పథం ఎలా ఉన్నది? చాలా సమస్యలను ఆస్తి సంబంధాల్లో వివరించిన వ్యక్తిలో మార్క్సిస్టు రాజకీయఅర్థశాస్త్ర అవగాహన ఎలా ఉన్నది? ఆయన మార్క్సిజాన్ని తత్వశాస్త్రంగానే చూశాడా? సామాజిక సిద్ధాంతంగా కూడా చూశాడా? అనే వైపునుంచి ఆయన ఆలోచనా పరిణామాన్ని చూస్తే బాలగోపాల్ ఏమిటి? అనే విషయం తేలుతుంది. ఆయన విలువల అభిభాషణకు సిద్ధాంతపరమైన అర్థమేమిటి?విలువల ప్రాతిపదిక అనేది మేథోరంగంలో ఒక పొజిషన్ తీసుకోడానికి పనికి వచ్చినంతగా సామాజిక విశ్లేషణా పద్ధతి అవుతుందా? లేకుంటే విలువలే లక్ష్యాలవుతాయా? బాలగోపాల్ గురించి మాట్లాడుకోవడమంటే ఇవన్నీ పట్టించుకోవడమే.

బాలగోపాల్ సాన్నిత్యాన్ని , ప్రభావాన్ని పొందడమేగాక అంతులేని సంఘర్షణపడిన విప్లవశిబిరం ఈ పని చేయవలసి ఉన్నది . ఈ సంచికలో అదెంత ఉన్నదోగాని ఉద్దేశ్యమైతే ఇదే.

| | | |
|---|---|---|
| ఈ సంచిక వెల | : | 25 రూ. |
| సంవత్సర చందా | : | 100 రూ. |
| జీవితచందా | : | 1000 రూ. |

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి. డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.